సాక్షి నాగర్‌కర్నూల్

ఆదివారం । 16 । మార్చి । 2025



సహాయక చర్యలు

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో కార్మికుల జాడ కోసం అన్వేషణ కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (ఆదివారం సాయంత్రం)

సహర్ 5-03 (సోమవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 40.5 / 18.3

ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఉక్క పోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు 141 మంది గైర్హాజరు

కందనూలు: జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. శనివారం జిల్లావ్యాప్తంగా 33 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా.. 5,063 మంది విద్యార్థులకు గాను 4,922 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 3,756 మందికి గాను 3,638, ఒకేషనల్ విభాగంలో 1,307 మందికి గాను 1,284 మంది హాజరై పరీక్షలు రాశారు. ఆయా విభాగాల్లో మొత్తం 141 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. కొల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను డీఐఈఓ వెంకటరమణ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేడు ప్రవేశ పరీక్ష



వెల్దండ: మండలంలోని గుండాల గ్రామం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 6వ తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పర్దీప్‌కుమార్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒకే పాఠశాల ఉండగా 394 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఆదివారం ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. 6వ తరగతి ప్రవేశానికి 60 సీట్లు మాత్రమే ఉండటంతో అధిక సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని ప్రిన్సిపల్ సూచించారు.

శనేశ్వరుడికి శాస్త్రోక్త పూజలు



బిజినేపల్లి: జేష్ఠాదేవి సమేత శనేశ్వరుడికి మండలంలో నందివడ్డెమాన్ గ్రామంలో ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలినాటి శనిదోష నివారణ కోసం భక్తులు శనివారం తెల్లవారుజామున ఆలయానికి చేరుకుని తిలతైలాభిషేకాలతో తమ గోత్రనామార్చనలతో పూజలు జరిపారు. బ్రహ్మసూత్ర పరమ శివుడిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపు శిర్సనగండ్లలో వేలం పాట

చారకొండ: మండలంలోని శిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో కొబ్బరికాయలు, కొబ్బరి ముక్కలు, తలనీలాలు, లడ్డు, పులిహోరా ప్రసాదాలకు సంబంధించి సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం పాట కొనసాగుతుందన్నారు. ఔత్సాహికులు కొబ్బరికాయలకు రూ.5 లక్షలు, తలనీలాలకు రూ.లక్ష, కొబ్బరి ముక్కలకు రూ.50 వేలు, లడ్డు, పులిహోర ప్రసాదాలకు రూ.లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

సోమశిల ఆలయంలో..

కొల్లాపూర్: మండలంలోని సోమశిల లలితాంబికా సోమేశ్వరాలయంలో టెంకాయలు, లడ్డూ ప్రసాద విక్రయాల కోసం సోమవారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి ముందస్తుగా తమ పేర్లు ఆలయ కమిటీ వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. వేలం దక్కించుకున్న వారు ఏడాదిపాటు ఆలయంలో టెంకాయలు, లడ్డు ప్రసాదాలు విక్రయించాల్సి ఉంటుందన్నారు.

ఆవిష్కరణలకు గుర్తింపు

పీయూలో పరిశోధనలపై దృష్టి సారించిన అధ్యాపకులు

- ఇప్పటికే కెమిస్ట్రీ విభాగంలో పూర్తిస్థాయి పేటెంట్ హక్కులు
- డిజైన్ విభాగంలో రెండు, యుటిలిటీలో ఒకటి, పరిశీలనలలో మరొకటి
- గుర్తింపు వస్తే పూర్తిస్థాయిలో కొత్త ఆవిష్కరణలకు అవకాశం



పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులు బోధనపైనే కాకుండా.. పరిశోధనలపై సైతం దృష్టిసారించారు. గత కొన్నేళ్లుగా సాగుతున్న పరిశోధనలతో పలు అంశాల్లో పేటెంట్ రైట్స్ సైతం సాధించారు. మొత్తం కెమిస్ట్రీ విభాగంలో అధ్యాపకులు పర్యావరణహిత రీ ఏజెంట్లు, ఎలాంటి కెమికల్స్ లేకుండా సాధారణ పర్యావరణానికి అనుకూలమైన విధానంలో తయారు చేయడం యూనివర్సిటీ చరిత్రలో ఓ మైలురాయి. దీనికి పేటెంట్ రైట్ రావడంతో టీచర్స్ అసోసియేట్ షిప్ ఫర్ రీసెర్చ్ ఎక్సలెన్స్ ఫెల్లోషిప్ అధ్యాపకులు చంద్రకిరణ్ ఎంపికయ్యారు. మ్యాథ్స్ విభాగంలో అధ్యాపకులు రిమోట్ కంట్రోల్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ తయారీ, రోలర్ స్టాంప్ తయారీకి డిజైన్ విభాగంలో పేటెంట్ రాగా.. స్ట్రెచింగ్ షీట్‌పై కాసన్ నానోఫ్లూయిడ్స్ ప్రవాహంలో వేడి, ద్రవ్యరాశి బదిలీని పంచే పద్ధతి వంటివి ఇటీవలే ఆవిష్కరించారు. ఇవి పరిశీలన దశలో ఉండగా.. మరో ఆవిష్కరణను ఎంబీఏ అధ్యాపకులు ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్రిడెక్టర్ వంటి పరికరాలు ఆవిష్కరించారు. దీంతో ఇటు అధ్యాపకులు రీసెర్చ్ స్కాలర్స్, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ విద్యార్థులు పరిశోధనల అనంతరం ఒక కొత్త యంత్రాల ఆవిష్కరణతో జరిగే ప్రయోజనం వంటి అంశాలపై దృష్టిసారించారు. - మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

కీలకంగా పర్యావరణహిత రీ ఏజెంట్లు



పేటెంట్ రైట్ సర్టిఫికెట్ చూపిస్తున్న అధ్యాపకులు చంద్రకిరణ్, రీసెర్చ్ స్కాలర్ స్వాతి (ఫైల్)

రసాయన పరిశ్రమలు, ట్యాబ్లెట్లు, ఇతర పరిశ్రమల్లో కెమికల్స్ తయారు చేసేందుకు రీ ఏజెంట్లు ఎంతో కీలకంగా మారనున్నాయి. ఇందులో రీ ఏజెంట్లు మొదట తయారు చేసేందుకు పెద్ద పరిశ్రమలను స్థాపించడం, పెట్టుబడి, ఇతర పర్యావరణానికి నష్టం చేసే విధంగా ప్రక్రియ చేయాల్సి ఉంటుంది. కానీ, పీయూ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు చేసిన ప్రయోగాలు పూర్తిగా పర్యావరణ హితం కానున్నాయి. సాధారణ గది ఉష్ణోగ్రతల వద్ద చిన్న గదుల్లో సైతం రీ ఏజెంట్లను శాస్త్రీయ పద్ధతిలో తయారు చేసే విధానాన్ని కొనుగొనడంతో మూడు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం పేటెంట్ రైట్ ప్రకటించింది. ఇందులో అధ్యాపకులు చంద్రకిరణ్, సిద్ధరామగౌడ్, రీసెర్చి స్కాలర్ స్వాతి భాగస్వాములయ్యారు. వీటితోపాటు మరో 20 రీఏజెంట్‌లో పరిశోధనలో ఉన్నాయి.

రిమోట్ కంట్రోల్‌తో ఆక్సిజన్..

పీయూ మ్యాథ్స్ విభాగంలో పేటెంట్ రైట్స్ దృష్టిసారించింది. ఇందులో డిజైన్ విభాగంలో శ్వాసకోశ రోగులకు ఆక్సిజన్ థెరపీ అందించేందుకు రిమోట్ కంట్రోలర్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ రూపొందించారు. ఇందులో పేషెంట్ ఆరోగ్యం, పరిస్థితి తదితర అంశాలను కాన్సన్‌ట్రేటర్ పరిశీలించిన తర్వాత రోగికి ఆక్సిజన్ అందిస్తుంది. అయితే రోగికి మ్యానువల్ పద్ధతిలో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేషన్ ద్వారా ఆక్సిజన్ సరఫరా చేయాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఉండే నేపథ్యంలో కేవలం రిమోట్ కంట్రోల్ ద్వారా ఆక్సిజన్‌ను అవసరం మేరకు అందిస్తే ఇబ్బందులు తప్పనున్నాయి. ఇందులో పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు శంకర్‌రావు, మధు, భారతి, సత్తమ్మ, లిపిక, అరుంధతి పాలుపంచుకున్నారు.



డిజైన్ విభాగంలో పేటెంట్ పొందిన మ్యాథ్స్ అధ్యాపకుడు మధును సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప (ఫైల్)

➩ రోలర్ స్టాంప్ పరికరాన్ని మ్యాథ్స్ విభాగం అధ్యాపకులు మధు ఆవిష్కరించగా.. పేటెంట్ రైట్ లభించింది. గణితం అంటే భయపడే పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈ పరికరం ఎంతో ఉపయోగపడనుంది. దీని ద్వారా గణిత ప్రక్రియలను సులభతరం చేసేందుకు అవకాశం ఉంది.

➩ రసాయన శాస్త్రంలో కెమికల్స్ ప్రాసెసింగ్, ఏరో స్పేస్, బయో మెడికల్ ఇంజినీరింగ్ పారిశ్రామిక అనువర్తనాల్లో వేడి, ద్రవ్యరాశి బదిలీలో కీలకపాత్ర పోషిస్తున్న స్ట్రెచింగ్ షీట్‌పై కాసస్ నానోఫ్లూయిడ్ ప్రవాహంలో వేడి, ద్రవ్యరాశి బదిలీని పెంచే పద్ధతిలో కూడా మ్యాథ్స్ విభాగంలో పరిశోధనలు పూర్తి కాగా పేటెంట్ రైట్ పరిశీలనలో ఉన్నాయి.

నానో టెక్నాలజీ బ్యాండేజీ..

సాధారణంగా గాయాలు త్వరగా తగ్గేలా సూక్ష్మజీవులను చంపేందుకు వినియోగించే బ్యాండేజీలు కొత్త విధానాన్ని ఆవిష్కరించడంలో పీయూ బాటనీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు శివకుమార్‌సింగ్ సఫలమయ్యారు. సూక్ష్మజీవులను చంపే బ్యాండేజ్‌లో చెట్ల రసాయనాలను వినియోగించి నానోపార్టికల్స్ ఆవిష్కరించారు. వీటి ప్రభావం సూక్ష్మజీవులపై ఎలా ఉంటుందో నిరూపించారు. ఈ ప్రయోగంలో బెంగళూరుకు చెందిన సైంటిస్టులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ ప్రయోగానికి 2023లో పేటెంట్ రైట్ అందుకున్నారు.



శివకుమార్‌సింగ్‌ను సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్ తదితరులు



అర్జున్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్ తదితరులు (ఫైల్)

కీలకంగా స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్..

పీయూ ఎంబీఏ విభాగంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేసే వారికి స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్ భవిష్యత్‌లో కీలక పరికరంగా మారే అవకాశం ఉంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే వారికి మంచి సాధనంగా మారుతుంది. దీని ద్వారా స్టాక్ మార్కెట్‌ను పరిశీలించడానికి ఏఐని వినియోగించనున్నారు. ఇది మార్కెట్ అంచనా వేసేందుకు ఇంటర్నెట్, సోషల్ మీడియాలో ఆర్థికపరమైన వార్తలు, మీడియా కథనాలను అంచనా వేసి ఏ కంపెనీ షేర్ మార్కెట్‌లో లాభాలు గడిస్తాయనే అంశంపై మిషన్ లెర్నింగ్, ఆల్గరిథమ్ ఆధారంగా సమాచారం ఇస్తుంది. ఇది అందించిన సమాచారం మేరకు ఏ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు అనే అంశంపై సమాచారం ఇస్తుంది. ఇందులో పలు కళాశాలలకు చెందిన సురేష్‌కృష్ణ, కన్నమ్మల్, గాయత్రి, అర్జున్‌కుమార్, కిరుబదేవి, సుమందీశ్వర్, రాజామణి పాల్గొనగా.. పీయూ అధ్యాపకులు అర్జున్‌కుమార్ కీలకంగా వ్యవహరించారు.

ప్రాధాన్యం ఇస్తున్నాం..



యూనివర్సిటీలో అధ్యాపకులు, ఇటు రీసెర్చ్ స్కాలర్ ఎంతో ఉత్సాహంగా పరిశోధనలపై దృష్టి సారిస్తున్నారు. ఇటీవల కొన్ని పేటెంట్లు కూడా వచ్చాయి. దీని ద్వారా పీయూకు ప్రాజెక్టులు, రీసెర్చ్ పరమైన అంశాల్లో ముందంజ వేస్తున్నాం. నిర్మాణంలో రీసెర్చ్ ఫెసిలిటీ భవనం ఉంది. అది అందుబాటులోకి వస్తే పీయూ రీసెర్చ్ హబ్‌గా మారనుంది. అందులో పూర్తిస్థాయిలో ల్యాబ్‌లో అధునాతన ప్రయోగ పరికరాలు అందుబాటులోకి తీసుకువస్తాం.

– శ్రీనివాస్, వైస్ చాన్స్‌లర్, పాలమూరు యూనివర్సిటీ

మరింత ఊతం..



యూనివర్సిటీలో రీసెర్చ్‌తో పాటు కొత్త ఆవిష్కరణలకు అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ కృషిచేయడం గొప్ప విషయం. భవిష్యత్‌లో రీసెర్చ్ ఫెసిలిటీ అందుబాటులోకి రానుంది. ఇంజినీరింగ్ కళాశాలకు రెగ్యులర్ అధ్యాపకులు రానున్నారు. దీంతో మరింత రీసెర్చ్ పెరగనుంది. పలు ప్రతిష్టాత్మక సంస్థలతో ఎంఓయూ చేసుకునేందుకు చర్చలు జరుగుతున్నాయి.

– మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పీజీ కళాశాల, మహబూబ్‌నగర్

ఆయిల్‌పాంకు ఆదరణ



పెంట్లవెల్లి శివారులో సాగు చేసిన ఆయిల్‌పాం తోట

రికార్డు స్థాయిలో టన్ను ధర రూ.20,871గా నిర్ణయం

- గతేడాదితో పోలిస్తే రూ.6 వేలకుపైగా అధికం
- జిల్లావ్యాప్తంగా 7,090 ఎకరాల్లో పామాయిల్ తోటల సాగు
- పంట సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉద్యానవన శాఖ

కొల్లాపూర్: జిల్లాలో ఆయిల్‌పాం పంటకు డిమాండ్ పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఆయిల్‌పాం ధరలు పలుకుతున్నాయి. గత నాలుగు నెలలుగా ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ధరలు వస్తున్నాయి. ఈ క్రమంలో జిల్లాలో ఆయిల్‌పాం దిగుబడి గతేడాది నుంచే ప్రారంభమైంది. పంటకు మంచి ధరలు లభిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభం..

ఎన్‌ఎంఈఓ– ఓపీ పథకం కింద 2019–20 సంవత్సరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఆయిల్‌పాం తోటల సాగుకు శ్రీకారం చుట్టారు. మొక్కలు నాటిన నాలుగేళ్ల తర్వాత దిగుబడి ప్రారంభమవుతుంది. ఉద్యానవన అధికారులు నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు ప్రాంతాల రైతులను ఒప్పించి 250 ఎకరాల్లో తోటలు నాటించగా.. గతేడాది దిగుబడి ప్రారంభమైంది. పంట దిగుబడి సాధించిన రైతులు టన్ను రూ.12–14 వేల వరకు అమ్ముకున్నారు.

ఈ ఏడాది అమాంతం పెరిగి..

ఆయిల్‌పాం పంట ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా అమాంతం పెరిగాయి. ప్రపంచ దేశాల్లో వంట నూనెల ఉత్పత్తుల కోసం ఆయిల్‌పాం వినియోగం పెరగడం, ఎగుమతులకు ప్రోత్సాహకాలు లభిస్తుండటం వంటివి ఇందుకు కారణం. గతేడాది ఆగస్టు వరకు ఆయిల్‌పాం టన్ను ధర రూ.14 వేలు పలకగా.. సెప్టెంబర్‌లో రూ.17 వేలు, అక్టోబర్‌లో రూ.19 వేలు, నవంబర్‌లో రూ.20 వేలకు ధర పెరుగుతూ వచ్చింది. నవంబర్ నుంచి ఇప్పటి వరకు రూ.20 వేలకు పైగానే కొనసాగిన ధరలు.. మార్చి 31 వరకు రూ.20,871 ప్రకారం టన్ను ఆయిల్‌పాం కొనుగోలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

రెగ్యులర్‌గా దిగుబడి

ఆయిల్‌పాం చెట్లకు నాలుగేళ్ల తర్వాత కాయలు కాస్తాయి. పదేళ్లలోపు చెట్ల నుంచి ప్రతి సంవత్సరం 6 టన్నుల వరకు, పదేళ్లు దాటిన చెట్ల నుంచి ఏడాదికి 10 టన్నుల వరకు పంట వస్తుంది. ఏడాదంతా పంట దిగుబడి వస్తూనే ఉంటుంది. ఈ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. టన్ను ధర కనిష్ఠంగా రూ.13 వేలు, గరిష్ఠంగా రూ.23 వేలకు పైగా ఉంటుంది.



ఆయిల్‌పాం గెలలు

పెరిగిన విస్తీర్ణం..

జిల్లాలో ఆయిల్‌పాం తోటలు 7,090 ఎకరాల్లో సాగవుతున్నాయి. నాలుగేళ్లలో 5 వేల ఎకరాల్లో మాత్రమే సాగు జరుగుతుండగా.. గతేడాది ఏకంగా 2 వేల ఎకరాల మేరకు సాగు విస్తీర్ణం పెరిగింది. వీటిలో కొల్లాపూర్ డివిజన్ పరిధిలో 1,492 ఎకరాలు, నాగర్‌కర్నూల్ డివిజన్‌లో 2,033 ఎకరాలు, అచ్చంపేట డివిజన్‌లో 1,154 ఎకరాలు, కల్వకుర్తి డివిజన్ పరిధిలో 2,411 ఎకరాల్లో తోటలు సాగవుతున్నాయి.

సాగుకు ప్రోత్సాహకాలు..

ఆయిల్‌పాం తోటల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్– ఆయిల్‌పాం ప్లాంటేషన్ స్కీం ప్రవేశపెట్టి.. సబ్సిడీ అందిస్తోంది. ఈ స్కీం ద్వారా డ్రిప్ సౌకర్యంతోపాటు సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఒక్కో ఎకరాకు మొత్తంగా రూ.50,918 సబ్సిడీగా లభిస్తుండగా.. రూ.193 విలువ చేసే ఆయిల్‌పాం మొక్కను ప్రభుత్వం సబ్సిడీపై రూ. 20కే అందిస్తోంది. ఎకరాకు దాదాపుగా 50 నుంచి 57 మొక్కలు నాటాలి. పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఎకరాకు ఏటా రూ.2,100 పెట్టుబడి, అంతర పంటల సాగు కోసం రూ.2, 100 సహాయంగా అందిస్తోంది. అలాగే సన్నకారు రైతులకు 90 శాతం, పెద్దకారు రైతులకు 80 శాతం సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం కల్పిస్తున్నారు.

దరఖాస్తులు తీసుకుంటున్నాం..

ఆయిల్‌పాంకు మంచి ధర లభిస్తోంది. జిల్లాలో రైతులు పండించిన పంటను ప్రీయూనిక్ కంపెనీ వాళ్లు కొనుగోలు చేస్తున్నారు. ఆయిల్‌పాం సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. గతంలో దరఖాస్తుదారులను వెయిటింగ్ లిస్టులో ఉంచేవాళ్లం. పెండింగ్ దరఖాస్తులన్నీ పూర్తికావడంతో మళ్లీ కొత్తగా దరఖాస్తులు తీసుకుంటున్నాం. ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– లక్ష్మణ్, ఉద్యానవన అధికారి, కొల్లాపూర్

కనులపండువగా వట్టెం వెంకన్న కల్యాణం



స్వామివారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

బిజినేపల్లి: వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం ఉదయం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు శ్రీమన్నారాయణాచార్యుల అర్చక బృందం ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణ ఘట్టాన్ని తిలకించారు. ప్రతాప్‌రెడ్డి, కృష్ణయ్య దంపతులు శ్రీవారి పక్షాన, నర్సింహారెడ్డి దంపతులు అమ్మవారి తరఫున పట్టువస్త్రాలు, తలంబ్రాలు, ముత్యాలు సమర్పించారు. అర్చకుల వ్యాఖ్యానంతో కల్యాణం తిలకించిన భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వమే కాంగ్రెస్ ధ్యేయం

మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్ క్రైం: సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన తెలంగాణ చరిత్రను కాపాడుకుందామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో ఎంపీ మల్లురవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్‌లో మంత్రి పాల్గొని మాట్లాడారు. సమాజంలోని ప్రజల మధ్య ఐక్యత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. ముస్లింల తల్లిదండ్రులు తమ పిల్లలను మంచిగా చదివించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తించాలన్నారు. ఎంపీ మల్లురవి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో రూ.6 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మరో రూ.2 వేల కోట్లను కేటాయించి బ్యాంకుల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషిచేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన ముస్లింల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. స్థానికంగా ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యేలను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడతామన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, గద్వాల జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు హబీబ్ ఉర్ రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి, పక్కన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి

రమణీయంగా లక్ష్మీనర్సింహుడి రథోత్సవం



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి శ్రీలక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి రథోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి రథాన్ని లాగి తరించారు. అనంతరం శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, నిత్యహోమాలు, బలిహరణం, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయ ఆవరణలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారావు, ఈఓ నర్సింహులు, పాలకవర్గ సభ్యులు గణేష్‌గౌడ్, స్వరూప, కృష్ణయ్య, ప్రదీప్‌ప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. అలివేలుమంగ రథోత్సవం


రథంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

- ఘనంగా గరుడవాహన సేవ
- భక్తి పారవశ్యంతో పులకించిన భక్తులు


అలంకరణలో ఉత్సవమూర్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయారు రథోత్సవం (విమాన రథోత్సవం) శుక్రవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా సాగింది. ముందుగా శోభాయమానంగా అలంకరించిన గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగతాయారు దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఉంచి సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ గర్భాలయం నుంచి ప్రధాన ద్వారం మీదుగా ఆలయ ఆవరణలోని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం రంగురంగుల పూలు, విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో ముస్తాబుచేసిన రథంపై ఉంచారు. రథం ముందు కుంభం పోసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తుల గోవింద నామ స్మరణలు చేస్తూ ముందుకు లాగారు. సాంప్రదాయ రీతిలో ఆలయం ముందున్న దేవగుండు వద్దకు లాగి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. రథోత్సవానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. బంగారు ఆభరణాలు, కాగడాలు, విద్యుద్దీపాల వెలుతురులో స్వామి, అమ్మవార్లు ధగధగ మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మళ్లీ ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై గర్భగుడి తీసుకొచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ప్రత్యేక అభిషేకం, బలిహరణం, హోమం తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి.

అశ్వవాహనసేవ..

అలివేలు మంగతాయారు ఆలయంలో శనివారం రాత్రి అశ్వవాహనసేవ నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తుల హరినామస్మరణ, పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురులో అశ్వవాహనం ముందుకు కదిలింది. స్వర్ణాభరణాల అలంకరణలో వేంకటేశ్వరస్వామి సమేత అలివేలు మంగతాయారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. విశేష దినోత్సవం సందర్భంగా గుట్టపైనున్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద భక్తుల రద్దీ కనిపించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, పాలక మండలి సభ్యులు వెంకటాచారి, సురేందర్, గోవిందు, అలువేలమ్మ, సుధ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

■ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం, పూర్ణాహుతి, అవభృతస్నానం, రాత్రికి నాగబలి (నాగవెల్లి), ద్వాదశ ఆరాధన, సప్తావరణాలు, మహా ఆశ్వీరచనం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. దీంతో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయి.

రమణీయం.. రామలింగేశ్వరుడి రథోత్సవం

- కందూర్‌లో మార్మోగిన శివనామస్మరణ
- భారీగా తరలివచ్చిన భక్తజనం


అలంకరణలో స్వామివారి మూల విగ్రహం


రథోత్సవానికి హాజరైన భక్తజనం

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం అర్ధరాత్రి రమణీయంగా సాగింది. ముందుగా గ్రామం నుంచి రామలింగేశ్వరస్వామి వెండి ముఖం, నాగపడగను మంగళవాయిద్యాలు, డప్పుచప్పుళ్ల నడుమ బాణసంచా కాలుస్తూ భక్తుల శివనామస్మరణతో ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ పూజారులు వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయం వెలుపలకు తీసుకొచ్చి అలంకరించిన రథంపై ఉంచారు. తర్వాత రథం ముందు పోలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి రథాంగ హోమం చేసి హారతులిచ్చారు. శనివారం తెల్లవారుజామున అశేష భక్తజనం శివనామస్మరణ చేస్తూ మేళతాళాల మధ్య స్వామివారి రథాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ముందుకు లాగారు. రథం ముందు భక్తులు భజనలు, కోలాటాలు చేస్తూ అందరిని అలరించారు. రథోత్సవానికి వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాజేశ్వరశర్మ, గ్రామపెద్దలు నాగిరెడ్డి, శ్రీహరి, రవీందర్‌శర్మ, దామోదర్‌రెడ్డి, రాములు, బుచ్చన్నగౌడ్, దేవన్నయాదవ్, మనోహర్, సత్తిరెడ్డి, అర్చకులు యాదగిరిశర్మ, తాళ్లపాక రామలింగశర్మ, శివశర్మ, మణికంఠశర్మ, రేవంత్‌శర్మ, వినయ్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

అచ్చంపేట రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ వ్యక్తిపై శనివారం అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని పాతబజార్‌లో సివిల్‌సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా... అనుమానాస్పదంగా ఓ ఆటోలో 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ బియ్యం ఎవరివని విచారించగా ఎండీ ఉస్మాన్ అనే వ్యక్తి తెల్ల రేషన్ కార్డుదారుల నుంచి బియ్యం సేకరించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముకుంటాడని తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. కాగా కొంతమంది అధికార పార్టీ నాయకులు, అధికారులు కేసు నుంచి అసలు సూత్రధారులను తప్పించే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం.

క్లుప్తంగా

సంప్‌లో పడి చిన్నారి మృతి


నాన్సీ(ఫైల్)

బల్మూర్: అప్పటివరకు అందరిని నవ్విస్తూ ఆడుకుంటున్న చిన్నారి సంప్‌లో పడి దుర్మరణం పాలైన ఘటన మండలంలోని కొండనాగుల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చింత మహేష్, సుస్మిత దంపతులు. వీరికి నాన్సీ(2) అనే కూతురు ఉంది. పక్కనే ఉన్న తాత బాలయ్య ఇంటికి ఆడుకుంటూ వెళ్లింది. అక్కడ చిన్నారిని ఎవరూ గమనించకపోవడంతో ఇంటి ముందు ఉన్న సంప్‌లో పడింది. కొంత సేపటికి గమనించిన కుటుంబ సభ్యులు చిన్నారిని సంప్‌లో నుంచి తీయగా అప్పటికే నీళ్లు మింగి ఊపిరాడక మృతి చెందింది. చిన్నారి మృతితో ఆకుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బావిలో పడి వ్యక్తి..


చంద్రయ్య (ఫైల్)

మిడ్జిల్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మిడ్జిల్ మండలం వేముల గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు.. వేములకు చెందిన రేవల్లి చంద్రయ్య (50) గురువారం రాత్రి గ్రామంలో నిర్వహించిన కాముడి దహనం కార్యక్రమానికి వెళ్లాడు. అర్ధరాత్రి 1గంటకు కాముడి దహనం ముగిసిన అనంతరం బుడిద తీసుకుని వస్తుండగా.. గ్రామ సమీపంలోని ఆలయం వద్ద ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో శనివారం గ్రామ సమీపంలోని ఆలయం వద్ద ఉన్న బావిలో శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడికి భార్య కళమ్మ, కుమారుడు శివకుమార్ ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..


రవీంద్రనాథ్‌రెడ్డి (ఫైల్)

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా నుంచి చెన్నిపాడుకు బైక్‌పై వెళ్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి(38) అనే వ్యక్తి పెద్దపోతులపాడు స్టేజీ సమీపంలో అదుపు తప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై అలంపూర్ చౌరస్తా నుంచి స్వగ్రామమైన చెన్నిపాడుకు బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైక్ అదుపు తప్పి కిందపడినట్లు చెప్పారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు

జడ్చర్ల: మండలంలోని కోల్‌బాయితండాకు చెందిన పాత్లావత్ శారద(45) తన ఇంటిలో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. కోల్‌బాయితండాకు చెందిన శారద భర్త శంకర్ ఆరేళ్ల క్రితం మృతిచెందగా ఆమె తన కుమారుడు సంతోష్, కోడలు జ్యోతిలతో కలిసి జీవిస్తుంది. అయితే కొడుకు, కోడలు తనను వేధిస్తున్నారని తన తండ్రి మునావత్ తథ్యుతో వాపోయింది. ఈ క్రమంలోనే శారద ఆత్మహత్యకు కుమారుడు, కోడలు కారణమని అనుమానంతో శనివారం ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొనసాగుతున్న సహాయక చర్యలు


సొరంగంలోకి తాగునీరు తీసుకెళ్తున్న సహాయక బృందాలు

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో లభ్యం కాని కార్మికుల ఆచూకీ

- కనీసం ఆనవాళ్లు కూడా లభించని వైనం
- హైడ్రాలిక్ పవర్డ్ రోబో పనితీరుపైనే ఆశలు
- డీ1 జోన్ ప్రాంతంలో బలహీనంగా పైకప్పు
- 22 రోజులు శ్రమిస్తున్న సహాయక బృందాలు


సొరంగంలోకి లోకో ట్రైన్‌లో వెళ్తున్న అన్వి రోబోటిక్ సంస్థ బృందం

అచ్చంపేట/ ఉప్పునుంతల: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల కోసం అడుగడుగునా అన్వేషిస్తున్నారు. 22 రోజులు గడుస్తున్నా ఇంత వరకు వారి ఆచూకీ దొరకలేదు. మానవ ప్రయత్నంలో కొంత ఇబ్బందులు ఎదురవుతుండటంతో ఏఐ టెక్నాలజీ ద్వారా అన్వి రోబోటిక్ సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోకు అనుసంధానంగా 30 హెచ్‌పీ సామర్థ్యం గల పంపు, వాక్యూమ్ ట్యాంకు ద్వారా సహాయక చర్యలు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం వాటిని సొరంగం వద్ద సాంకేతిక పరిజ్ఞానంతో ఇన్‌స్టాలేషన్ చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. మరోవైపు సాంకేతిక సమస్యలతో రోబో యంత్రాల పనితీరు ఇంకా ప్రారంభం కాలేదు. డీ2 ప్రదేశం నుంచి డీ1 వరకు సింగరేణి, ఎన్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా, ర్యాట్ హోల్ మైనర్స్ ఇతర సహాయక బృందాలు మట్టి, బురద తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. టీబీఎం ఎర్త్ కట్టర్ ఉన్న ప్రాంతం పూర్తిగా 40 అడుగుల మేర కూరుకుపోయింది. అక్కడి వరకు మనుషులు వెళ్లి సహాయక చర్యలు చేపట్టడం ఇబ్బందికరంగా ఉంది. టీబీఎం విడి భాగాలను ప్లాస్మా కట్టర్‌తో తొలగిస్తున్నారు. డీ1 డేంజర్ జోన్ ప్రాంతంలో పైకప్పు బలహీనంగా ఉండటంతో కాంక్రీట్ సెగ్మెంట్ కూడా పడిపోయే పరిస్థితి గమనించి సింగరేణి గనుల్లో ఉపయోగించే టైగర్ కారడ్స్ కలప దుంగలను సపోర్టుగా చేసుకుంటూ తవ్వకాలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు వీటిని నాలుగు చోట్ల ఏర్పాటు చేశారు. వీటికి సుమారు 40 టన్నుల బరువు ఆపగలగే శక్తి ఉంది. ప్రమాదం జరిగే ముందు శబ్దం వస్తుందని, దీని వల్ల కార్మికులు సురక్షితంగా తప్పించుకునే అవకాశం ఉంటుందని సింగరేణి కార్మికులు వెల్లడించారు. డీ1 ప్రదేశానికి వెళ్లడానికి ఇంకా 30 మీటర్ల మట్టిని తొలగిస్తే సహాయక బృందాలు అక్కడికి చేరకుంటాయి. డీ1 వద్దకు చేరుకుంటే తప్ప తప్పిపోయిన కార్మికుల ఆచూకీ లభ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. డీ1 వద్ద పూర్తిస్థాయిలో మట్టిని తీసేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. మరో రెండు, మూడు రోజుల్లో ఆచూకీ లభ్యమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మార్గనిర్దేశనం చేస్తున్నాం..

ప్రమాద ప్రదేశంలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం సొరంగంలోని పరిస్థితులపై కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌తోపాటు సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సొరంగంలో జరుగుతున్న పురోగతిపై సమీక్షించి అవసరమైన మార్పులను అమలు చేస్తూ మార్గనిర్దేశనం చేస్తున్నట్లు వెల్లడించారు. సహాయక బృందాల మధ్య సమన్వయంతో పనులు చేపడుతున్నామని, మరింత వేగవంతం చేసేందుకు అత్యాధునిక రోబోటిక్ పద్ధతులను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. అన్వి రోబోటిక్ సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో ద్వారా 30 హెచ్‌పీ సామర్థ్యం గల పంపుతో అనుసంధానమైన వాక్యూమ్ ట్యాంకు ఉపయోగించి నీటితో కూడిన బురద, మట్టిని తొలగించనున్నట్లు తెలిపారు. సొరంగంలోని నీటిని తొలగించేందుకు డీ-వాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా ఆధునిక పరికరాలు ఉపయోగించి శరవేగంగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రత్యేకంగా ఆక్సిజన్ సరఫరా, వైద్యసేవలు, ఆహారం, మంచినీరు వంటి అవసరాలను నిరంతరం అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రాధాన్యంగా సహాయక బృందాల భద్రతకు దృష్టిలో పెట్టుకుని అత్యవసర అవసరాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. అనంతరం లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంక్‌తో కూడిన మిషన్ పనితీరు పరిశీలించారు.

పండ్లకు భలే గిరాకీ

- ఉపవాసదీక్షలతో పెరిగిన వినియోగం
- రిటైల్‌గా జోరందుకున్న వ్యాపారం
- అమాంతంగా పెరిగిన ధరలు


దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పండ్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ మాసంలో పండ్లకు గిరాకీ ఎక్కువగా ఉంటోంది. మిగతా రోజుల కంటే ఈ మాసంలో పండ్ల వినియోగం అధికంగా ఉండడంతో ధరలు కూడా అంతేస్థాయిలో ఉన్నాయి. అరటి పండ్ల డజన్ ధర గత వారంతో పోలిస్తే రూ.5 నుంచి రూ.10 వరకు పెరిగింది. ద్రాక్ష పండ్లు అయితే కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ద్రాక్ష పండ్ల ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు అంటున్నారు. రంజాన్ మాసంలో ఎక్కువగా వినియోగించే కర్బుజా (పుచ్చకాయ) పండు కిలో రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయిస్తున్నారు. రిటైల్ మార్కెట్లో పండ్ల విక్రయాలు జోరందుకున్నాయి. రంజాన్ ఉపవాసదీక్షలో ముస్లింలు రోజు సాయంత్రం ఇఫ్తార్ వేళ పండ్లు ఎక్కువగా తీసుకుంటారు. యాపిల్, ఖర్జూర, పుచ్చకాయలు, పైనాపిల్, దానిమ్మ, ద్రాక్ష, బత్తాయి, బొప్పాయి, అరటి, సపోట వంటి పండ్ల వినియోగం పెరగడంతో వీటి ధరల్లో రోజురోజుకు మార్పు కనిపిస్తుంది. ముస్లింలకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులకు భారీఎత్తున పండ్లు అవసరమవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని పండ్ల ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్, అశోక్ టాకీస్ చౌరస్తా, జనరల్ ఆస్పత్రి, న్యూటౌన్, క్లాక్‌టవర్, అంబేడ్కర్ చౌరస్తా, పద్మావతికాలనీతోపాటు ఇతర ప్రాంతాల్లో పండ్ల స్టాళ్లను ఏర్పాటు చేశారు. రూ.20 నుంచి 25 వరకు ఉన్న యాపిల్ రంజాన్ మాసంలో రూ.30 నుంచి 35 వరకు, ఆరెంజ్ పండ్లు డజన్ ప్రకారం రూ.180 నుంచి 200 వరకు అమ్ముతున్నారు.

మార్కెట్లో వివిధ రకాల పండ్ల ధరలు

యాపిల్	రూ.25-30(ఒకటి)
ద్రాక్ష	రూ.80-100(కిలో)
దానిమ్మ	రూ.25-30(ఒకటి)
బత్తాయి	రూ.15-20(ఒకటి)
బొప్పాయి	రూ.50-60 (కిలో)
ఖర్బూజ	రూ.20-25 (కిలో)
అరటి	రూ50-60(డజన్)
సపోట	రూ.40-50 (కిలో)

ధరలు అందరికీ అందుబాటులో ఉండాలి



రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల సందర్భంగా పండ్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈసారి కూడా పండ్ల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. పెరిగిన ధరలతో పండ్లను కొనుగోలు చేయలేని పరిస్థితి. పండ్ల ధరలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటే బాగుంటుంది.

– జహంగీర్‌బాబా, సద్దల్‌గుండు, మహబూబ్‌నగర్

దారిదోపిడీకి యత్నించిన ముఠా అరెస్ట్




వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ , స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

- 10 తులాల బంగారం, 22 తులాల వెండి ఆభరణాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిననాగర్‌కర్నూల్ ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం: జల్సాలకు అలవాటుపడి దారి దోపిడీకి యత్నించిన ఓ ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. వనపర్తికి చెందిన బొల్లెమోని బాబు, బొల్లెమోని అంజి, పుట్టపాకుల శ్రీకాంత్, హైదరాబాద్‌కు చెందిన నందిమళ్ల హరిగణేశ్, యాత రవి, పెంట్లవెల్లికి చెందిన గిరిధర్‌నాయుడు, సాయికుమార్, హరికృష్ణ, అఖిల్ జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతుండేవారు. పెంట్లవెల్లికి చెందిన రాజవర్ధన్, వెంకటేశ్వర్లు, రమేష్, రాఘవేంద్రాచారి బంగారు వ్యాపారులు. వీరంతా ఈ నెల 6న బంగారు కొనుగోలుకు హైదరాబాద్ బయలుదేరారు. నిందితుడు సాయికుమార్ ఈ సమాచారాన్ని బొల్లెమోని బాబుకు అందించడంతో పాటు హరికృష్ణ, గిరిధర్ నాయుడుకు ఓ అద్దె కారు, సెల్‌ఫోన్ అప్పగించి బంగారు వ్యాపారస్తుల కారు వెంటే వెళ్తూ ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ఆ వ్యాపారులు హైదరాబాద్‌లోని కాళీకమాన్ వద్ద బంగారు కొనుగోలు చేసి బయలుదేరగా నిందితులు మిగతా వారిని అప్రమత్తం చేయడంతో పాటు వారి వెంటే వచ్చారు. కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి శివారు కేఎల్ఐ వంతెన వద్ద స్వామి, అంజి రాళ్లు అడ్డుపెట్టడంతో పాటు సిమెంట్ దిమ్మెలను, అఖిల్ తల్వార్‌ను చేతిలో పట్టుకోవడంతో పాటు హరిగణేష్, రవి, శ్రీకాంత్ రోడ్డు పక్కన నిలిచి ఉన్నారు. బంగారు వ్యాపారుల కారు అక్కడికి చేరుకోగానే నిందితులు కారుపై సిమెంట్ దిమ్మెలతో దాడి చేసేందుకు యత్నించగా అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా అక్కడి నుంచి వేగంగా తప్పించుకొని వెళ్లిపోయారు. బంగారు వ్యాపారి రాజవర్ధన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టారు. శుక్రవారం రాత్రి కొల్లాపూర్‌లో పెట్రోల్‌బంక్ వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా బొల్లెమోని బాబు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించడంతో పాటు మిగతా వారి సమాచారం ఇవ్వడంతో ఏడుగురిని అరెస్టు చేశారు. వీరంతా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 24 చోట్ల చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి వేర్వేరు దొంగతనాలకు సంబంధించి 10 తులాల బంగారు, 22 తులాల వెండి ఆభరణాలు, దారి దోపిడీకి యత్నించిన కారు, రెండు మోటారు సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్లు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని.. కోర్టు అనుమతితో మరోమారు పోలీస్ కస్టడీకి తీసుకొని విచారిస్తామని చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం

రూ. 3లక్షల ఆస్తినష్టం

మక్తల్: షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధమైన ఘటన మక్తల్ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఊట్కూరు మండలం తిప్రాస్‌పల్లికి చెందిన అశోక్ మక్తల్‌లోని సంగం బండ రోడ్డులో బట్టల షాపు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి 8 గంటలకు షాపును మూసివేసి ఇంటికి బయలుదేరారు. అతడు వెళ్లిన కొద్ది సేపటికే షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అశోక్ అక్కడికి చేరుకొని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే దుకాణంలోని సగానికి పైగా వస్త్రాలు కాలిపోయాయి. దాదాపు రూ. 3లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. దగ్ధమైన షాపును సీఐ రాంలాల్, ఎస్ఐ బాగ్యలక్ష్మీరెడ్డి పరిశీలించారు.


దగ్ధమైన వస్త్ర దుకాణం

తాళం వేసిన ఇంట్లో చోరీ

బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లిలో కృష్ణమోహన్ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న కృష్ణమోహన్ ఇంటికి తాళం వేసి శుక్రవారం యాదాద్రికి వెళ్లారు. శనివారం తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా మూడున్నర తులాల బంగారం, రూ.50 వేలు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

వైజ్ఞానిక ప్రదర్శనలతో ప్రతిభ బయటపడుతుంది

బిజినేపల్లి: పాఠశాలల్లో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా వారిలోని ప్రతిభను బయటికి తీయవచ్చని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పాలెం హైస్కూల్‌లో విద్య వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనకు డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై సందర్శించారు.

ఉద్యోగ నియామకాలు ప్రకటించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం, ఎస్సీ వర్గీకరణకు చట్టం తీసుకొస్తున్న తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్ డిమాండ్ చేశారు. మాదిగల సంఘాల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం కొనసాగాయి. కార్యక్రమంలో మండల నాయకులు యాకోబు, శ్రీశైలం, శేఖర్, చంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్



ఉప్పునుంతల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కో చైర్మన్ శ్యామలగౌరి ఆధ్వర్యంలో విద్యార్థులు తెలంగాణ, హర్యానా రాష్ట్రాలకు సంబంధించి వివిధ రకాల వేషధారణలో వారి సంస్కృతి సాంప్రదాయాలను, భాషా విధానాలు, ఆచార వ్యవహారాలు, నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ

నాగర్‌కర్నూల్ క్రైం: వేసవి దృష్ట్యా ఆర్టీసీ సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని శనివారం ప్రారంభించినట్లు డిపో మేనేజర్ యాదయ్య తెలిపారు. విధుల్లో ఉన్న డ్రైవర్లు, కండెక్టర్లకు ప్రతి రోజు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రైతు భరోసా ఇవ్వాలి

తాడూరు: రైతులందరికి రుణమాఫీ పూర్తి చేసి రైతు భరోసా ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వార్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలం కేంద్రలో నిర్వహించిన గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మారేడు శివశంకర్ సత్యం కురుమయ్య, యాదయ్య పాల్గొన్నారు.

చరిత్ర మార్చడం భావ్యంకాదు

మన్ననూర్: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగానికి గుర్తుగా ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు చేసి చరిత్రను మార్చవద్దని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు జూలూరు సత్యనారాయణ, సంబు వెంకటరమణ, బిల్లకంటి రమేష్, సంబు నరేష్, భాస్కర్‌లు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాల యం పేరు మార్పు చేయవద్దని కోరారు.

గొర్రెలు, పొట్టేళ్ల అపహరణ

లింగాల: మండలంలోని సూరాపూర్ శివారులోని పొలంలో ఉన్న గుంపు నుంచి 10 గొర్రెలు అపహరణకు గురైన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ నాగ రాజు వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుల గ్రామానికి చెందిన చంద్రయ్య యాదవ్ గొర్రెలను మేపుకుంటూ మండలంలోని సూరాపూర్ శివారులో ఓ వ్యవసాయ పొలంలో గొర్రెల మందను నిలిపాడు. నాలుగు రోజుల క్రితం 8గొర్రెలు, రెండు పొట్టేళ్లు అపహరణకు గురైనట్లు శనివారం గుర్తించాడు. దీంతో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు పాటించాలి

ఊర్కొండ: వాహనదారులు నిబంధనలను తప్పకుండా పాటించాలని ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు. మండలంలోని జడ్చర్ల కల్వకుర్తి 167వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలనుద్దేశించి మీడియా సమావేశంలో మాట్లాడారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం పత్రాలు ఉంచుకోవాలని, చిన్నపిల్లలకు వాహనాలను ఇవ్వరాదని ఇచ్చిన వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపుతామని ఎస్ఐ పేర్కొన్నారు.

బిల్లులు భద్రపరుచుకోవాలి



మాట్లాడుతున్న చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ మధుసూదన్‌రావు

- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ మధుసూదన్ రావు

నాగర్‌కర్నూల్ క్రైం/కొల్లాపూర్: ప్రతినిత్యం వస్తువులను కొనుగోలు చేసినప్పుడు వాటికి సంబంధించిన బిల్లులు, వారంటీ, గ్యారంటీ పేపర్లను భద్రపరచుకోవాలని, ఆ వస్తువు నాసిరకం వస్తువైతే జిల్లా వినియోగదారుల ఫోరాన్ని సంప్రదించి అమ్మిన డీలర్ మీద, ఉత్పత్తిదారుల మీద కేసు వేయవచ్చని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న వెంకటయ్య

మెంబర్ మధుసూదన్ రావు అన్నారు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం పెద్ద ముద్దునూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఆర్టీసీ, రైళ్లు, విమానాలలో ప్రయాణించినప్పుడు టికెట్‌ను భద్రపర్చుకోవాలని, ఏదైనా అసౌకర్యం కలిగితే వినియోగదారుల కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్లు శ్రీరాంఆర్య, హర్షవర్ధన్‌రావు పాల్గొన్నారు.

- కొల్లాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్‌తో పాటు ఎకనామిక్స్ లెక్చరర్ వెంకటయ్య మాట్లాడారు. వినియోగదారుల చట్టాలు, వారి హక్కుల గూర్చి వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రమేష్‌కుమార్, కురుమయ్య, శివుడు, మౌనిక, సోఫీ, విష్ణు, మహదేవుడు, అనిత, కేశవులు, బాలరాజు ఉన్నారు.

ఏఐతో విద్యా బోధన విద్యార్థులకు వరం

తాడూరు/తెలకపల్లి/తిమ్మాజిపేట: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో విద్యా బోధన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వరం లాంటిదని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. శనివారం మండలంలోని ఐతోల్ ప్రాథమిక పాఠశాలలో ఏఐతో విద్యాబోధన తరగతులను డీఈఓ రమేష్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాసన మరింత ఆకర్షణీయంగా, ఇంట్రాక్టివ్‌గా నిర్వహించడానికి ఏఐ మెరుగ్గా పనిచేస్తుందన్నారు. దీంతో విద్యార్థుల స్థాయిని అంచనా వేస్తూ.. అందుకు తగినట్టుగా అభ్యాస కృత్యాలు జనరేట్ చేయడంతో విద్యాభ్యాసంపై పిల్లల్లో మరింత ఉత్సాహం పెంచేలా చేయవచ్చన్నారు. విద్యార్థులందరూ ప్రతిరోజు కంప్యూటర్ ల్యాబ్‌ను వినియోగించేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. మండలంలోని ఐతోల్‌తోపాటు మేడిపూర్ పాఠశాలల్లో ప్రయోగాత్మంగా ప్రారంభించామన్నారు. ఏఐ ఆధారిత బోధనలో భాగంగా మండలం నుంచి ఒక ఉపాధ్యాయుడిని ఏఐ విద్యా బోధన శిక్షణకు పంపించామన్నారు. బోధనలో ఉపాధ్యాయుల తీరును ఎంఈఓలు పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని రోజువారి గా సమీక్షించాలని ఆదేశించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నా రు. విద్యార్థుల వ్యక్తిగత అభ్యాసన శైలీని మెరుగుపరచడంతోపాటు తక్కువ సమయంలో ఎక్కువ నేర్చుకునే అవ



ఐతోల్‌లో ఉపాధ్యాయులతో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అమరేందర్

కాశం లభిస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 13 ప్రాథమిక పాఠశాలల్లో పైలెట్ ప్రా జెక్టు ద్వారా ఎంపిక చేసి ఏఐ తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంఓ షర్ఫుద్దీన్, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- విద్యాబోధనలో భాగంగా పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన ఆలేరు ప్రాథమిక పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను పాఠశాల కమిటీ చైర్మన్ అమృతమ్మతో కలిసి కాంప్లెక్స్ హెచ్ఎం సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు.
- తిమ్మాజిపేట మండలంలోని మారేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఎంఈఓ సత్యనారాయణశెట్టి నూతన విద్యావిధానంలో భాగంగా కంప్యూటర్లను ప్రారంభించారు. ఏఐ టెక్నాలజీ ద్వారా 3, 4, 5వ తరగతి విద్యార్థులకు తేలికగా విద్యా బోధన చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి



మాట్లాడుతున్న బాలనర్సింహ

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జాతీయ, గ్రామీణ ఉపాధిహామీ పనులు ప్రారంభించి కూలీలకు పనులు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎం బాలనరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వ్యవసాయ పనుల పూర్తి అయి కూలీలకు పనుల్లేక అధికారులకు మొరపెట్టుకున్నా, పనులు కల్పించే పరిస్థితి లేదని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి కూలీలపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నదని, ఉపాధి పథకాన్ని మోదీ సర్కార్ నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోళ్ల యోసయ్య, ఉపాధ్యక్షులు ఈర్ల చంద్రమౌళి, నాయకులు వెంకటస్వామి, కొమ్ము భరత్, మారేడు శివశంకర్, రవీందర్, విష్ణు, రాధకృష్ణ, విజయ్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో 'పది' ప్రశ్నాపత్రాలు



వెల్దండ: పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాలు నిర్వాహకులు శనివారం పోలీస్‌స్టేషన్ భద్రపరచినట్లు తెలిపారు. ఈనెల 21నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి వెల్దండ మండలానికి పరీక్ష పత్రాలు రావడంతో మొదటి సెట్ ప్రశ్నాపత్రాలను ప్రత్యేక పెట్టెల్లో భద్రపరిచి సిల్‌వేసి పోలీస్‌స్టేషన్‌లో పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఎంఈఓ శంకర్‌నాయక్, నిర్వహకులు రవీందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాన్షీరాం ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి



కొల్లాపూర్‌లో కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్/కొల్లాపూర్/కోడేరు: పట్టణంలో బీఎస్పీ నాయకులు, దళిత సంఘాల నాయకులు, మంతటి క్రాస్‌రోడ్ వద్ద జిల్లా స్వేరోస్ నాయకుల ఆధ్వర్యంలో కాన్షీరామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆయ సంఘాల నిర్వహకులు పాల్గొన్నారు.

- కొల్లాపూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం జయంతిని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, వారి సంక్షేమం కోసం తుదిశ్వాస విడిచే వరకు కృషి చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు బొల్లి కురుమయ్య, నాయకులు కేశపాగ వెంకటేష్, ప్రశాంత్, బాలకృష్ణ, హరిబాబు, లక్ష్మణ్, రామకృష్ణ, విష్ణు, విక్రమ్, గోవిందు, సాయికుమార్, అశోక్, సాలాకర్ ఉన్నారు.



మంతటి క్రాస్‌రోడ్డు వద్ద కాన్షీరామ్ జయంతిలో పాల్గొన్న జిల్లా స్వేరోస్ నాయకులు

- చారకొండ మండల కేంద్రంలో ధర్మజమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయ్, ధర్మసమాజ్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు మల్లేష్, నాయకులు శంకర్, శ్రీను, సంజీవ, వంశీ, తదితరులు ఉన్నారు.
- కోడేరు మండల కేంద్రంలో కాన్షీరాం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్, ఆది దానయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఆది సోమనాథ్, మిద్దె రామకృష్ణ, ఆది రాజు, యాపచెట్టు లాలు పాల్గొన్నారు.

విద్యార్థులను పాఠశాలకు పంపాలి



పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను వేళ ప్రకారం పాఠశాలలకు పంపాలని ప్రధానోపాధ్యాయుడు సాయిప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్దకారుపాముల ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇళ్లకు భూమి పూజ



పెద్దకొత్తపల్లి: ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఇందిరమ్మ మోడల్ ఇంటికి మండల స్పెషల్ ఆఫీసర్ మోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటికి ఇచ్చే రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం ఎలా చేపట్టాలో లబ్ధిదారులకు చూపించేదుకే ఈ మాడల్ హౌస్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. 15 రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేందర్ నాయకులు చంద్రయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎండిన మొక్కజొన్న పంటల పరిశీలన



ఇప్పలపల్లిలో ఎండిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

తిమ్మాజిపేట: వ్యవసాయ బోర్లు, బావులలో నీరు లేక ఎండిన మొక్క జొన్న, వరి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. తిమ్మాజిపేట మండలంలోని ఇప్పలపల్లి శివారులో పలువురు రైతులు మొక్కజొన్న, వరి పంటలు వేశారు. కోతకు వస్తున్న తరుణంలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఇటీవల మండల వ్యవసా అధికారుల దుష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, నాగర్‌కర్నూల్ ఏడీఏ వాసు, టెక్నికల్ ఏడీఏ పూర్ణచందర్‌రెడ్డి, మండల ఏఓ కమల్‌కుమార్ గ్రామానికి వెళ్లి ఎండిన పంటలను పరిశీలించారు. పంటలు వేసిన రైతులు శంకర్‌నాయక్, గణేష్, రమేష్‌లతో వ్యవసాయ అధికారులు వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. బోర్లలో నీటి మట్టం తగ్గడం వల్ల మొక్కజొన్న, వరి పంటలు ఎండిపోయినట్లు అధికారులకు తెలిపారు. పంటలు ఎండిన వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని డీఏఓ రైతులకు హామీ ఇచ్చారు.

జైభీమ్ దీక్షలు ప్రారంభం



జైభీమ్ దీక్షలను తీసుకున్న దళిత సంఘాల నాయకులు


నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో శనివారం జైభీమ్ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్చి 15 నుంచి ఏప్రిల్ 14 వరకు ప్రతియేట జై భీమ్ సమితి ఆధ్వర్యంలో జైభీమ్ దీక్షలు కొనసాగిస్తున్నామని జైభీమ్ సమితి వ్యవస్థాపకులు వంకేశ్వరం నిరంజన్ తెలిపారు. మార్చి 15న కాన్షీరామ్ జయంతి నుంచి ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతి వరకు దీక్షలు కొనసాగనున్నట్లు తెలిపారు. దళిత బహుజనులకు దిశ, నిర్దేశం చూపి దిక్సూచిల పనిచేసిన మహనీయులను స్మరించుకోవడమేనన్నారు. కార్యక్రమంలో వంకేశ్వరం శ్రీనివాసులు, జయశంకర్, జానకీరాములు, పరుషరాములు ఉన్నారు.

తపాలద్వారా భద్రాచలం రాముడి తలంబ్రాలు

పెద్దకొత్తపల్లి: తపాలశాఖ ద్వారా భద్రచలం శ్రీరాములవారి కల్యాణం తలంబ్రాలు పోస్ట్ ద్వారా భక్తులకు అందజేయనున్న నాగర్‌కర్నూల్ తపాల అధికారి సృజన నాయక్ అన్నారు. శనివారం పెద్ద కొత్తపల్లి పోస్ట్ ఆఫీస్‌లో ఆయన మాట్లాడుతూ తలంబ్రాలకు రూ.150 చెల్లిస్తే ముత్యాల తలంబ్రాలు పోస్ట్ ద్వారా భక్తులకు ఇస్తామన్నారు. రూ.450 చెల్లిస్తే గోత్ర నామాలతో పసుపు కుంకుమ ముత్యాల తలంబ్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. డబ్బు చెల్లించిన భక్తులకు వారి ఇంటివద్దకు తలంబ్రాలు పంపించడం జరుగుతుందన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి

కల్వకుర్తి రూరల్: పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు మీటర్లు, పానెల్ బోర్డులు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు కోరారు. శనివారం లబ్ధిదారులతో కలిసి పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజినీర్ బసవలింగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 12న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు ఇచ్చారన్నారు. అప్పుడు ఎమ్మెల్యే నాలుగు రోజులలో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని అందుకోసం రూ.4లక్షలు కేటాయిస్తున్నానని చెప్పినట్లు తెలిపారు. ఇప్పటివరకు మీటర్లు ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో నరసింహ, కృష్ణవేణి, బాలకృష్ణ, సుభాన్, లలిత, యాదగిరి, వెంకటేష్ పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్ బసవలింగానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యువత ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలి



కల్వకుర్తి రూరల్: యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే ఆలోచించకుండా, స్వయం ఉపాధితో జీవితంలో ఉన్నత స్థాయి చేరుకోవాలనే ఆలోచనతో పాటు అవకాశాలను మెరుగుపర్చుకోవాలని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. శనివారం పట్టణంలోని వైఆర్ఆర్ కాంప్లెక్స్‌లో మన కల్వకుర్తి పేరుతో యువకులు ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీశైలం, శేఖర్ రెడ్డి, నిర్వహకులు మురళి, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో ఇళ్లకు నంబర్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లడుతున్న ఆర్ శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక పట్టణంలోని 17వ వార్డు బీసీ కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న వారందరికి ఇంటి నంబర్లు ఇవ్వాలని సీఐటీ యూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బీసీ కాలనీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించి మాట్లాడారు. రోడ్లకు అడ్డంగా ఉన్న గోడలను తొలగించాలని, మిషన్ భగీరథ నీళ్ళు ఇవ్వాలని, సీసీ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంఅలో నాయకులు పర్వతాలు, రమేష్, బాలరాజు, రవి, ఈశ్వరమ్మ, వెంకటమ్మ, కాశమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేచర్ గైడ్ శిక్షణకు చెంచులు



శిక్షణకు వెళ్తున్న యువత బస్సుకు జెండా ఊపుతున్న ఏఓ జాఫర్ ఉస్సేన్

మన్ననూర్: అటవీశాఖ, ఐటీడీఏ సంయుక్త ఆధ్వర్యంలో చెంచు యువతీ యువకులకు నేచర్ గైడ్ విధానంపై శిక్షణ ఇప్పించడం కోసం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోహిత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఓ ప్రత్యేక బస్సులో శనివారం బెంగుళూర్‌కు తీసుకెళ్లడం జరుగుతుందని ఐటీడీఏ ఏఓ జాఫర్ ఉస్సేన్ తెలిపారు. గత నెలలో మన్ననూర్‌లోని ఐటీఐ శిక్షణా సంస్థ ప్రాంగణంలో నేచర్ గైడ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న 61 మంది అభ్యర్థులు రాత పరీక్ష రాశారు. వారిలో అర్హులైన 33 మంది ఆదివాసి చెంచు యువతీ యువకులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అన్ని ఖర్చులు ప్రభుత్వమే భరిస్తూ బెంగుళూర్‌లోని ఫిగ్ ట్రీ న్యాచురాలిటీ స్కూల్ మల్లేశ్వరంలో 30 రోజుల నేచర్ గైడ్స్ శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో నేచర్ గైడ్స్‌గా నియమించేందుకు వారికి మొదటి ప్రాధాన్యతగా ఉపాధి అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు.

వేడుకరావుపల్లికి బస్‌సౌకర్యం కల్పించాలి

పెద్దకొత్తపల్లి: వేడుకరావుపల్లి తండాకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి దశరథం అన్నారు. శనివారం తండాలో నెలకొన్న సమస్యలపై సర్వే చేశారు. తండాకు ఏఎన్ఎంలు రాకపోవడంతో విషజ్వరాల బారిన తండావాసులు పడ్డారన్నారు. సీసీరోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తండాకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ పాల్గొన్నారు.

పెంట్లవెల్లిలో రిలే నిరాహార దీక్షలు



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు రాములు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను మూడు గ్రూపులుగా కాకుండా నాలుగు ఏ బీ సీ డీ లుగా చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో రాములు, మండల నాయకులు కురుమయ్య, శేకర్, పరశురాములు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎన్మన్‌బెట్ల గ్రామంలో ఉన్న వీరమనాయిని చెరువుకు కేఎల్ఐ ప్రాజెక్టు సింగోటం రిజర్వాయర్ నుంచి సాగు నీరు విడుదల చేయాలని సీపీఎం మండల నాయకులు సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన రైతులతో కలసి చెరువును సందర్శించి పరిశీలించారు. సాగునీరు లేక రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరువుకు సాగునీరు రాకపోవడంతో 500 ఎకరాల పంటలు ఎండిపోయాయన్నారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కేఎల్ఐ ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి చెరువుకు సాగునీరు విడుదలకు పనులు ప్రారంభించారు. ఎన్నికలు రావడంతో ఆగిపోయినట్లు తెలిపారు. ఇప్పటికైనా మంత్రి జూపల్లి చొరవ తీసుకొని చెరువుకు సాగునీరు అందించేందుకు పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఉద్యమం చేస్తామన్నారు.

విద్యార్థినికి సన్మానం

అచ్చంపేట రూరల్: ఇటీవల ప్రకటించిన గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాల్లో సత్తాను చాటిన విద్యార్థి మద్దెల శైలజను శనివారం అచ్చంపేటలో పలు సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. గ్రూప్-4లో ప్రతిభ చాటి లింగాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అచ్చంపేట రామనాథం, పారిజాత దంపతుల కుమార్తె శైలజను పలువురు అభినందించారు.


లక్నారంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

తెలకపల్లి: మండలంలోని లక్నారం గ్రామంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన నూకం వరప్రసాద్ జ్ఞాపకార్థం నాగర్‌కర్నూల్ జిల్లా యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 45 యూనిట్ల రక్త దానం చేసినట్లు యువశక్తి ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి ల్యాబ్ టెక్నీషియన్ రాజు, షాకీర్, నర్సింగ్, హరికృష్ణ, రాము పాల్గొన్నారు.

తొలి ప్రయత్నంలోనే గ్రూప్-2, 3లో ప్రతిభ



తెలకపల్లి: తొలి ప్రయత్నంలోనే గ్రూప్-2,3కు యుకుడు ఎంపికయ్యాడు. మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన దండు రమేష్ ఇటీవల వెలువడిన గ్రూప్-2,3 ఫలితాల్లో రాష్ట్రంలో టాపర్‌గా నిలిచాడు. గ్రూప్-2 ఫలితాల్లో 394, గ్రూప్-3లో 420 ర్యాంకులు సాధించాడు. తొలి ప్రయత్నంలోనే ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో మండల ప్రజలు గ్రామస్తులు, యవకులు హర్షం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా ప్రిపరేషన్ ఉన్నట్లు రమేష్ తెలిపారు.